క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న భక్తులు

ఖమ్మం అర్బన్: నగరంలోని శ్రీఅంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల నూతన దేవాలయ నిర్మాణానికి లక్ష్మీనర్సింహా గ్రానైట్ యజమాని మల్లెల మన్మథరావు - రేణుక దంపతులు రూ.1,00,116 విరాళం ప్రకటించారు. వీరితోపాటు బాలాజీనగర్ వాసులు లింగా మోహన్‌రావు - జ్యోతి దంపతులు రూ.10,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు.

23న న్యాయవాదులకు తరగతులు

ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యాన న్యాయవాదులకు ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు కవిత మెమోరియల్ డిగ్రీ కాలేజీలో తరగతులు నిర్వహిస్తామని ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావులు తెలిపారు. ఈ తరగతులు ఏజెన్సీ లా, ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ వంటి విషయాలపై ఉంటాయని, సకాలంలో న్యాయవాదులు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామేపల్లి: కొత్తలింగాల 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ గోవింద్రాల ఫీడర్‌లో గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ కోత ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

సీఎంను కలిసిన 'ఎర్నేని'



సీఎం రేవంత్‌రెడ్డితో ఎర్నేని రామారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిలతో కలిసి సీఎంను కలిసినట్లు ఎర్నేని చెప్పారు. తెలంగాణ కమ్మ సమైక్య ఫెడరేషన్ తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ పూర్తి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల 108 సిబ్బందికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలో బుధవారం శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు రెండు రోజులు, పైలెట్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. అయితే ఈ శిక్షణలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు లింగంపల్లి కృష్ణయ్య, యాటనానయ్య పైలెట్లు పల్లెబోయిన వీరయ్య, దరంసోత్ సక్రు శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, సాయికిరణ్, ఎగ్జిక్యూటివ్ దుర్గలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కాంగ్రెస్ కార్యాలయంలో తనిఖీలు

అధికారులతో నాయకుల వాగ్వాదం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు ఉన్నాయని సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు అందడంతో పాలేరు ఆర్‌ఓ రాజేశ్వరి ఆదేశాల మేరకు అధికారులు కార్యాలయానికి వచ్చారు. దీంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీఓ ఎం.యర్రయ్యతో వాగ్వాదానికి దిగారు. తమ కార్యాలయంలోనే జెండాలు ఉన్నాయా, బీఆర్ఎస్ కార్యాలయంలో కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అయితే, తమకు రాజకీయాలకు సంబంధం లేదని, అన్ని పార్టీ కార్యాలయాలలో జెండాలు, ఫ్లెక్సీలు తొలిగిస్తామని ఆయన బదులిచ్చారు. నాయకులు జెర్రిపోతుల అంజిని, ఎం.వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేశ్, అనంతు సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్టాండ్ పక్కన ఉన్న 33/11 విద్యుత్ ఉపకేంద్రం గోడ వెంబడి కాల్చిన వ్యర్థాలు



కేఎంసీ చెత్తశుద్ధి..!

ఎన్నెస్పీ క్యాంపులో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- రోడ్ల వెంటే వ్యర్థాలు..
- కొత్త బస్టాండ్ చుట్టూ ఖాళీ కొబ్బరి బొండాలే
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



బస్టాండ్ పక్కన రోడ్డు వెంట పోసిన వ్యర్థాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతుంది. రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. రోడ్ల వెంట వ్యర్థాలు పోస్తున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రధానంగా ఎన్నెస్పీ క్యాంపులో ఖాళీ ప్రదేశాలు డంపింగ్‌యార్డ్‌లను తలపిస్తున్నాయి. కొత్త బస్టాండ్ చుట్టూ రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టింగ్ వ్యర్థాలతో పాటు గృహాలు, దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలే కనిపిస్తున్నాయి. కేఎంసీ కార్యాలయానికి కూత వేటు దూరం ఉన్న ఎన్నెస్పీ క్యాంపులో పోసిన వ్యర్థాలను ఎత్తడంలో కార్మికులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాసం ఉండే వారు, బస్టాండ్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నెస్పీ క్యాంపు ఖాళీ స్థలాలు, రోడ్లు డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్నాయని చర్చించుకుంటున్నారు.

వ్యర్థాలన్నీ అక్కడే..

ఎన్నెస్పీ క్యాంపులోని కొత్త బస్టాండ్ వెనుక వైపు ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం చుట్టూ బస్టాండ్‌లోకి వెళ్లేందుకు రోడ్డు మార్గాలు ఉన్నాయి. స్థానికులతో పాటు బస్టాండ్ నుంచి వెలువడే వ్యర్థాలు, వీధి వ్యాపారుల నుంచి వచ్చే వ్యర్థాలన్నింటినీ ఈ రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో పోస్తున్నారు. దీంతో అవి మురుగు కాల్వల్లోకి చేరి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇక బస్టాండ్‌లో దుకాణదారులు కేఎంసీ ట్రాక్టర్లకు వ్యర్థాలను ఇవ్వకుండా బస్టాండ్ పక్కన ఖాళీ స్థలాల్లో పోసి వాటిని కాల్చివేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా కాలుష్యంతో నిండిపోతుంది. దీన్ని అడ్డుకోవాల్సిన కేఎంసీ అధికారులు, సిబ్బంది ఆ దిక్కుగా చూసే పరిస్థితి లేదు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ రోడ్డు మార్గాల ద్వారా బస్టాండ్‌లోకి వెళ్తుంటారు. దుర్వాసన, వ్యర్థాలను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాల్లో తరలింపు..



బస్టాండ్ వెనుక మున్సిపాలిటీకి వెళ్లే రోడ్డు వెంట ఖాళీ కొబ్బరి బొండాలు

ఎండలు పెరగడంతో నగరంలో కొబ్బరి బొండాల విక్రయాలు పెరిగాయి. తాగిన ఖాళీ కొబ్బరి బొండాలు, వాటి వ్యర్థాలను కేఎంసీ సేకరించకపోవడంతో వాటిని కొందరు ప్రైవేట్ వాహనాల్లో డబ్బులు ఇచ్చి బయటకు తరలిస్తుండగా.. మరికొందరు ఎన్నెస్పీ క్యాంపులోని ఖాళీ స్థలాలు, బస్టాండ్ చుట్టూ రోడ్ల వెంట పడేస్తున్నారు. ఇలా పడేసిన వ్యర్థాలు వారాలు గడిచినా.. కేఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది అక్కడ నుంచి తొలగించడం లేదు. బస్టాండ్, అంబేడ్కర్ కళాశాల మధ్యలో ఉన్న రోడ్డు వెంట మొత్తం ఖాళీ కొబ్బరి బొండాలతో నిండిపోయింది.

పర్యవేక్షణ కరువు..

కేఎంసీలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో రోడ్ల వెంట, కూడళ్లల్లో వ్యర్థాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతోనే వ్యర్థాలను రోడ్లపై పోస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఆదేశించినా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పారిశుద్ధ్యాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా పర్యవేక్షించడం లేదని, అధికారులు సైతం పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారన్న చర్చ కేఎంసీలో ఉంది. ఇలానే కొనసాగితే కేఎంసీ పరిధిలో పారిశుద్ధ్యం మరింత లోపిస్తుందన్న విమర్శలు వస్తూనే ఉంటాయి.

వ్యర్థాలు వేయకుండా చూడాలి..



బస్టాండ్ చుట్టూ వ్యర్థాలు పోయడంతో ప్రాంగణంలోకి వెళ్తే కుళ్లిన దుర్వాసన వస్తోంది. బస్టాండ్ నుంచి బయటకు వస్తే ఏ రోడ్డులో చూసిన రోడ్డు వెంట వ్యర్థాల కుప్పలుగా కనిపిస్తున్నాయి. బస్టాండ్ చుట్టూ పక్కల వ్యర్థాలు పోయకుండా చూడాలి.

– ఎం.నాగేశ్వరరావు, ప్రయాణికుడు

ఇబ్బంది పడుతున్నాం..



ఎన్నెస్పీ క్యాంపులోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు కుప్పలుగా పోస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోయకుండా పర్యవేక్షించాలి. ఇప్పటికైనా పోసిన వ్యర్థాలను తొలగించాలి. దుర్వాసనతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నాం.

– ఝాన్సీ, స్థానికురాలు

ప్రజలంతా ఐక్యంగా పోరాడాలి

రఘునాథపాలెం: ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ప్రగతి శీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఖమ్మం జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీలక్ష్మిలు పిలుపునిచ్చారు. మండలంలోని వేపకుంట్ల గ్రామంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్జాయ శ్రామిక మహిళా దినోత్సవ సభలో వారు మాట్లాడారు. విద్యా, వైద్యం, వేతనాలు ఇలా అన్నింటిలో అడుగడుగునా స్త్రీలు వివక్షతకు గురవుతున్నారని, మహిళల సంక్షేమం కోసం చట్టాలు ఎన్ని చేసినా దేశం, రాష్ట్రంలో మహిళలు దాడులకు, హత్యలకు బలవుతూనే ఉన్నారన్నారు. అసమానతలకు దోపిడీకి వ్యతిరేకంగా కష్టానికి తగిన ఫలితం కోసం శ్రామిక మహిళలంతా పోరాటం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంగతాయి

ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బానోత్ పద్మ నాయకులు స్వాతి, మేక రేణుకమ్మ, కోనపుడి సుగుణమ్మ, జక్కుల వనత, బాలిన రమాదేవి, చక్కల ఎల్లమ్మ, విజయ, సుగుణమ్మ, సంతోషం, నాగమణి, ఉమా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఠానునాయక్ అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బానోత్ భద్రునాయక్ అన్నారు. పోరాటయోధుడు ఠానునాయక్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఖమ్మంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భద్రూనాయక్ మాట్లాడుతూ.. ఆనాటి దేశ్‌ముఖ్ గుండాల చేతిలో హతమైనా.. ఆయన ఎప్పటికీ అమరుడే అంటూ ఠానునాయక్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీమా, జంగిపల్లి రవి, ఉపేంద్రబాయి, భట్టు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డి పర్యటన

ఖమ్మం రూరల్/కూసుమంచి: ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేటలో నాయుడుపేట యూత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాలేరు నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్మూర్తినాయక్, కల్లెం వెంకట్‌రెడ్డి, మద్ది కిశోర్‌రెడ్డి, అజ్మీరా అశోక్‌నాయక్, అజ్మీరా కిశోర్ నాయక్, ఏనుగు వెంకట్‌రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను దయాకర్‌రెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయాలు అందించారు.

నియామకం

నేలకొండపల్లి: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా దోసపాటి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ భవన్‌లో జరిగిన నామినేషన్ సందర్భంగా చంద్రశేఖర్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అదే విధంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా రేగూరి హనుమంతరావు నియమితులయ్యారు.

జర్నలిస్టులపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆకుతోట ఆదినారాయణతో పాటు మరో ముగ్గురిపై నమోదైన కేసును కొట్టివేస్తూ బుధవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ నెల 14న ఖమ్మం మూడో పట్టణ పోలీసులకు జర్నలిస్టులపై ఫిర్యాదు రాగా, కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వినుకొండ మాధవి సరైన సాక్ష్యాలు లేవని కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు.

పూలేకు భారతరత్న ప్రకటించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలేకు భారతరత్న అవార్డు ప్రకటించాలని అంబేడ్కర్ యువజన సంఘం, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అంబేడ్కర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వచ్చే నెల 11న పూలే జయంతిని పురస్కరించుకొని ముద్రించిన కరపత్రాలను ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాముళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్ జయంతులను గడప గడపకు తీసుకెళ్లాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్, వేమూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకురాలి మృతికి..

తిరుమలాయపాలెం: సీపీఎం సీనియర్ నాయకురాలు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు దొండేటి రామచంద్రయ్య సతీమణి అనసూయమ్మ మృతికి సీపీఎం నాయకులు బుధవారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ, ఎర్ర శ్రీకాంత్, బండి రమేశ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్‌లు అనసూయమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో వారు మాట్లాడుతూ.. అనసూయమ్మ మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో బసీరుద్దీన్, కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, దొండేటి ఆనందరావు, పప్పుల ప్రసాద్, పద్మనాభుల సుధాకర్, పప్పుల ఉపేందర్, నిర్మల్‌రావు, కల్లూరి శరత్ యూటీఎఫ్ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ డ్రెయిన్‌లో మురుగు తొలగింపు



మురుగును తొలగిస్తున్న ప్రొక్లెయిన్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్ సీక్వెల్ ప్రాంతంలో మేజర్ డ్రెయిన్‌లోకి చేరిన మురుగు తొలగింపు పనులను బుధవారం చేపట్టారు. అండర్ గ్రౌండ్ పైపు లైన్ల నిర్మాణంతో మురుగు మేజర్ డ్రెయిన్‌లోకి చేరి స్థానిక నివాసులు ఉండలేని పరిస్థితి ఏర్పడడంతో స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ కేఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్ఈ రంజిత్ స్పందించి ప్రొక్లెయిన్ ద్వారా లకారం చెరువు అలుగు వద్ద నుంచి మమత ఆస్పత్రి రోడ్డు కల్వర్టు వరకు పేరుకుపోయిన మురుగును తొలగించేలా చర్యలు చేపట్టారు.

సప్తకళల సమ్మేళనం బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం నిర్వహించే సప్తకళల సమ్మేళనం బ్రోచర్లను ఖమ్మం కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేతలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించడంలో ఖమ్మం కళా పరిషత్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. సప్తకళల్లో భాగంగా మిమిక్రీ, డ్యాన్స్, ఫుట్‌బాల్ వంటి ప్రదర్శనలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, కళాపోషకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సప్తకళల సమ్మేళనం నిర్వాహకుడు ఫైర్ రవి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

కామేపల్లి: పండితాపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బోడేపూడి రామకోటయ్య-పుష్పవల్లిఖాంభ జ్ఞాపకార్థం కుమారుడు విఠల్‌రావు ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి క్యాంపు ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. జాతరలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు నిర్వహించారు. గురువారం శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.కాగా, స్వామివారి కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మెక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్ తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దినేని రమేశ్‌బాబు, బానోత్ నర్సింహానాయక్, మేకపోతుల మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం..



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారి రవికుమార్, తదితరులు

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్ కాత్రాల రోశయ్యపై సొసైటీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ఎన్నికల అధికారి రవికుమార్ అధ్యక్షతన కామేపల్లి సొసైటీ సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించగా.. 12 మంది డైరెక్టర్లు హాజరైయ్యారు. వీరిలో 11 మంది డైరెక్టర్లు చైర్మన్‌ను వ్యతిరేకించడంతో రోశయ్య చైర్మన్ పదవి వీగిపోయింది. లాటరీ పద్ధతిలో ఎన్నిక జరగగా దొంగల వెంకటనర్సమ్మ చైర్మన్ పదవి కైవసం చేసుకుంది. కాగా, ఈ నెల 22న పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు రవికుమార్ తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

ఖమ్మంమయూరిసెంటర్: సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆపద, విపత్తు సంభవించినప్పుడు ప్రజలను ఆదుకోవడంలో యువత ముందుండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి యువకులు టెర్రరిజం వైపు కొట్టుకుపోతున్నారని, అన్ని అంశాలను డబ్బు చుట్టూ తిప్పుతూ డబ్బులు సంపాదించడమే జీవిత లక్ష్యంగా పని చేస్తున్నారని, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో పక్క వారిని పట్టించుకోవడమే మర్చిపోతున్నారని అన్నారు. భగత్‌సింగ్ కూడా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటంలో యువతలందరినీ కలుపుకొని వచ్చి తెల్లదొరలను తరిమికొట్టే దానికి జీవితాన్ని త్యాగం చేశాడని, ఆయన స్ఫూర్తితో యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీవీకే మేనేజర్ శ్రీనివాసరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్, నాయకులు శీలం వీరబాబు, కూరపాటి శ్రీను, పొనుగుల సుధాకర్, జక్కంపూడి కృష్ణ, తోట నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఖురాన్ పఠనంతో మానసిక ప్రశాంతత

ఖమ్మం మామిళ్లగూడెం: పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్‌ను చదవడం, నేర్వడం, ఆచరించడం ద్వారా ప్రతీ మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ముఫ్తీ మహ్మద్ రవూఫ్‌ఖాన్ ఖాస్మి అన్నారు. గొల్లగూడెంలోని తాలిమున్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక తరవీహ్ నమాజ్ ద్వారా తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మదర్సాలో జరిగిన ఖత్మే ఖురాన్ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. ఇస్లాం ఇచ్చిన ప్రతీ సందేశాన్ని ప్రతి ఒక్కరూ మరో పది మందికి చేరవేయాలని సూచించారు. తమ పక్కన ఉండే ఇరుగుపొరుగు వారి ఆకలిని తీర్చమని చెప్పిందే ఇస్లాం అన్నారు. అంతకు ముందు జరిగిన ఇఫ్తార్ విందుకు నగర నలుమూలల నుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



కేక్ కట్ చేస్తున్న బీజేపీ శ్రేణులు

నేలకొండపల్లి: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జాతీయ నాయకులు ఈటెల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మెహినుద్దీన్, బాజా రామకృష్ణ, తోగాటి నాగచారి గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ల తనిఖీ



ఎన్టీఆర్ సర్కిల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: సాధారణ ఎన్నికల నేపథ్యాలో నగరంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను బుధవారం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తనిఖీ చేశారు. చెక్ పోస్టుల్లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. చెక్ పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట నిఘా చర్యలు చేపట్టి, విస్తృత తనిఖీలు చేయాలన్నారు. ప్రతీ చెక్ పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాహనాల తనిఖీలకు సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలని, ప్రతీ చెక్‌పోస్టులో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆర్టీసీ లీగల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాము

ఖమ్మం లీగల్: ఖమ్మం నిజాంపేటకు చెందిన సీనియర్ న్యాయవాది నాగటి రాము ఆర్టీసీ ఖమ్మం లీగల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈమేరకు తాజాగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. 2005లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న రాము సీనియర్ న్యాయవాది తుళ్లూరి రమేశ్‌బాబు వద్ద జూనియర్‌గా పనిచేశారు. ఆయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన సేవలు అందించాలి

కామేపల్లి: వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కామేపల్లి క్రాస్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించి వారి ఆదరాభిమానాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బంక్ నిర్వాహకులు భూక్యా భాషానాయక్, నాయకులు మానుకొండ రాధాకిషోర్, కుర్రా భాస్కర్‌రావు, మల్లీదు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కొనకంచి వరప్రసాద్, కట్టెకోల వెంకన్న, పిన్ని కోటేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి మహేందర్, అంతోటి అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ ఆకస్మిక తనిఖీ..

కామేపల్లి: కామేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ముందుగా ఎంజేపల్లి హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మండల పంచాయతీ అధికారి శివకు బుధవారం వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి.గుడవర్తి నాగేశ్వరరావు, మధుసూదన్‌రావు, తిరుపతిరావు, బాబు, బొడ్డు బాబు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం త్రీటౌన్‌లో బుధవారం మృతిచెందిన ఓ అనాథ వృద్ధ మృతదేహానికి బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రకాశ్‌నగర్ వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ఖమ్మం 60వ డివిజన్‌లో తన సొంత ఖర్చులతో అనాథలకు అంత్యక్రియలతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, భిక్షాటన చేసేవారికి భోజనం పండ్లు, బ్రెడ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు కుక్కల ప్రవళిక, పంది వేణు, కె.సైదులు, గట్టికొండ చుక్కయ్య, కె.కాశయ్య, పడిశాల వీరస్వామి, సీతారాములు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.